క్లుప్తంగా

ఇబ్బందులకు గురిచేయొద్దు



నల్లబెల్లి : రైతులను మిల్లర్లు ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని ఎస్సై నైనాల నగేష్ అన్నారు. మండలంలోని శనిగరం భార్గవ రైస్ మిల్లును శనివారం ఆయన సందర్శించారు. రైతులు, మిల్లు యజమానితో వేర్వేరుగా మాట్లాడారు. తరుగు పేరుతో అదనంగా ధాన్యాన్ని తీసుకోవద్దని మిల్లు యజమానికి సూచించారు. ధాన్యం కొనుగోలు నిర్వాహకులు, మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేస్తే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఆయన వెంట పోలీసులు ఉన్నారు.

అవార్డు అందజేత



నర్సంపేట : నర్సంపేటకు చెందిన ఏఎస్ఆర్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు ఎర్రబోయిన రాజశేఖర్‌కు దశాబ్ది వేడుకల్లో భాగంగా జిల్లా స్థాయి ఉత్తమ సోషల్ సర్వీస్ అవార్డును శుక్రవారం కలెక్టర్ ప్రావీణ్య, ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ అందించారు. ఈ సందర్భంగా శనివారం రాజశేఖర్‌ను పలువురు అభినందించారు.

క్విజ్ విజేతలకు నగదు బహుమతి

నయీంనగర్: చైతన్య (డీమ్డ్ టు బీ విశ్వవిద్యాలయం) ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన క్విజ్ చివరి ఎపిసోడ్‌లో టీటీడబ్ల్యూ ఆర్ఏఎఫ్‌డీసీ నర్సంపేట కళాశాలకు చెందిన దుర్గం సాయివర్ధన్, రమావత్ పవన్ విజేతలుగా నిలిచారు. వారికి ఓఎస్డీ కె.వీర వెంకటయ్య రూ. లక్ష చెక్కును బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో డి.భూపతిరాజ్, ఎస్.సునీల్, డి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సర్పంచ్‌కు గాయాలు

రాయపర్తి : రోడ్డు ప్రమాదంలో మండలంలోని రాగన్నగూడెం సర్పంచ్ రెంటాల గోవర్ధన్‌రెడ్డికి తీవ్రగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. శుక్రవారం రాత్రి తొర్రూరు వైపు నుంచి రాయపర్తికి కారులో వస్తుండగా ప్రమాదం జరిగినట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు వరిగడ్డి దగ్ధం



సంగెం : మండలంలోని గవిచర్ల గ్రామంలో డక్క జనార్దన్‌కు చెందిన 1.20 ఎకరాల్లోని వరిగడ్డి శనివారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. రైతు గడ్డిని కట్టలు కట్టించి పొలంలో ఉంచాడు. శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా నిప్పంటుకుని మంటలు ఎగిసిపడ్డాయి. పక్కనే ఉన్న ధాన్యం అంటుకోకుండా స్థానిక రైతుల సాయంతో కాపాడుకున్నారు. కానీ వరి గడ్డి కట్టలు మాత్రం కాలిబుడిదయ్యాయి.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్‌కు చెందిన కుంట రమేష్ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో కుర్చీ మీద కూర్చున్న అతను కింద పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నర్సంపేటలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కాగా భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

విద్యుదాఘాతంతో జీవాలు..



పర్వతగిరి: మండలంలోని సోమారం గ్రామానికి చెందిన ఏషబోయిన చేరాలుకు చెందిన రెండు గొర్రెలు, ఒక మేక శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందాయి. గొర్రెలు, మేక తాగునీటి కోసం వెళ్లే క్రమంలో విద్యుత్ వైర్లు వాటిపై పడడంతో అవి అక్కడికక్కడే మృతి చెందాయి. సుమారు రూ.30వేల విలువైన జీవాలు మృతి చెందాయని, ప్రభుత్వం ఆదుకోవాలని చేరాలు కోరుతున్నాడు.

కేసు నమోదు

చెన్నారావుపేట : చెన్నారావుపేట శివారులోని ఈర్యతండాకు చెందిన అజ్మీరా రవి తన సోదరుడు రాంధన్ భూమి విషయంలో శుక్రవారం గొడవ పడ్డారు. కాగా, రాంధన్ అతని భార్య మంగమ్మ రవి ఇంటిపై కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో రవి భార్య కవితకు గాయాలయ్యాయి. రవి ఫిర్యాదు మేరకు రాంధన్, మంగమ్మలతో పాటు పలువురిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు.

రాయపర్తి: మహిళా రైతును సన్మానిస్తున్న నాయకులు



ఖానాపురం: రైతులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు



గీసుకొండ: కొనాయమాకులలో రైతుల ఎడ్లబండ్ల ర్యాలీ



నల్లబెల్లి: ఎడ్లబండిలో వస్తున్న జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న



రైతుల సంక్షేమానికి కేసీఆర్ పెద్దపీట

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా రైతు వేదికల్లో రైతు దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, డప్పుచప్పుళ్లు, కోలాటాలతో రైతువేదికలకు చేరుకొని సమావేశాలు నిర్వహించారు. ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని అన్నారు. అనంతరం ఉత్తమ రైతులను సన్మానించి భోజన సదుపాయం ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



చెన్నారావుపేట: కరపత్రం ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు తదితరులు



నర్సంపేట రూరల్: గురిజాలలో ఎడ్లబండిపై వస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు



వర్ధన్నపేట: ఎడ్లబండి తోలుతున్న ఎమ్మెల్యే రమేశ్



గీసుకొండ: మొగిలిచర్లలో..



దుగ్గొండి: ఎడ్లబండిలో వస్తున్న శ్రీనివాస్



నర్సంపేటలో..



దుగ్గొండి: గిర్నిబావిలో అన్నదాతల ర్యాలీ



నెక్కొండ: మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు, హమాలీలు



సంగెంలో.. ఎడ్లబండిపై జెడ్పీటీసీ సుదర్శన్ రెడ్డి



గీసుకొండ: కల్లులొట్లు, కోడిపిల్లతో ర్యాలీగా..



పర్వతగిరి: శ్రీనగర్‌లో..



రాయపర్తిలో..



ఖానాపురంలో..

రైతులు పుట్టెడు బాధతో ఉన్నారు

ఎంపీపీ భీమగాని సౌజన్య



మాట్లాడుతున్న ఎంపీపీ సౌజన్య

గీసుకొండ : రైతులు సంతోషంగా లేరని, అనేక బాధలు, కష్టాల్లో ఉన్నారని ఎంపీపీ భీమగాని సౌజన్య అన్నారు. శనివారం ఎలుకుర్తిహవేలిలో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన రైతు దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పండించిన ధాన్యం, మొక్కజొన్నలను కొనుగోలు కేంద్రాలకు తీసుకు వెళ్తే బస్తాకి రూ.56 వసూలు చేస్తున్నారని, మిల్లర్లు బస్తాకు 5 కిలోల తరుగు తీస్తున్నారన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు పరిహారం ఎకరానికి రూ. పది వేలు ఇంకా రాలేదన్నారు. సబ్సిడీ విత్తనాలు, పరికరాలు ఇవ్వడం లేదని, ఇలాంటి సమస్యలు తీరినప్పుడు రైతులు సంతోషంగా ఉంటారన్నారు. అలాగే కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రైతులకు రుణమాఫీ చేయడం కాలేదని, పంటలకు గిట్టుబాటుధర లభించడం లేదని, అన్నింటిలో రైతులు దగాపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ పూంద్రు జయపాల్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు బొల్లె భిక్షపతి, ఏట హరిప్రసాద్‌బాబు, వైస్ ఎంపీపీ రడం శ్రావ్య, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద్ద.. ట్రక్కు



రాయపర్తి : మండలకేంద్రం మీదుగా భారీ మిషన్‌లతో తొర్రూరు వైపు వెళ్తున్న ట్రక్కును మండల వాసులు ఆసక్తిగా చూశారు. మామూలుగా అయితే లారీకి నాలుగు లేదా ఆరు టైర్లు ఉంటాయి. కానీ ఈ ట్రక్కుకి 50 టైర్లు ఉన్నాయి. అతిపెద్ద మిషనరీ సామగ్రితో వైజాగ్‌కు తీసుకెళ్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రజకులకు అసెంబ్లీ సీట్లు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రాయపర్తి : రజకులకు రాష్ట్రవ్యాప్తంగా ఐదు అసెంబ్లీ సీట్లు కేటాయించాలని తెలంగాణ రజక రిజర్వేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు ఉల్లెంగుల యాదగిరి, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కోడిపుంజుల చంద్రయ్య డిమాండ్ చేశారు. శనివారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..రజకులను తక్షణమే ఎస్సీ జాబితాలో చేర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రజకులకు రూ.1లక్ష ఆర్థికసాయం చేయడం కాదని రూ.10లక్షలు కేటాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి, ఈస్ట్‌జోన్ కన్వీనర్ నార్లగిరి కుమారస్వామి, ఉల్లెంగుల యాదగిరి, యాకయ్య, మచ్చ వెంకన్న, నీలయ్య, ఉప్పలయ్య, రమేష్, వేణు, రాజయ్య పాల్గొన్నారు.

జమిలి పోరాటాలకు రాష్ట్ర ప్లీనరీ

నర్సంపేట: సామాజిక వర్గ జమిలి పోరాటాలకు అగ్రవర్ణ ఆధిపత్య దోపిడీ పాలకులకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం నింపేలా నిర్మాణాత్మక ఉద్యమాలు చేపట్టేందుకు పార్టీ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు జరుగుతున్నాయని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ తెలిపారు. ఈమేరకు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 4న నర్సంపేటలో భారీ ప్రదర్శన నిర్వహించి బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనికి కేరళ ప్రొటెం స్పీకర్ కె.రేమ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్, పొలిట్ బ్యూరో సభ్యులు కాటం నాగభూషణం, వల్లెపు ఉపేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. ఈనెల 4, 5, 6 తేదీల్లో జరిగే రాష్ట్ర ప్లీనరీ సమావేశాలకు రాష్ట్రవ్యాప్తంగా 25 జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని, జాతీయ నాయకత్వం పరీక్షలకు హాజరై సూచనలిస్తారని ఆయన తెలిపారు. సమావేశాల విజయవంతానికి పార్టీ కార్యకర్తలు తగిన విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

గోవధను నిరోధించాలి



మాట్లాడుతున్న మహేష్ అగర్వాల్

వర్ధన్నపేట : చట్టవిరుద్ధంగా గోవధ జరుగకుండా సంబంధిత శాఖను ప్రభుత్వం ఆదేశించి, చర్యలు తీసుకోవాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్‌అగర్వాల్ కోరారు. శనివారం వర్ధన్నపేట పట్టణ పరిధిలోని గోశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బక్రీద్ పండుగకు కనీసం నెల రోజుల ముందుగా ఆదేశాలు జారీ చేయాలన్నారు. అక్రమంగా తరలిస్తున్న ఆవులు, దూడలను స్వాధీనం చేసుకుని గోవధను నిరోధించాలన్నారు. పశువులను విక్రయించే వ్యాపారులను బైండోవర్ చేయాలన్నారు. అక్రమ వధకు పాల్పడుతున్న కసాయి కార్యకలాపాలను గమనించి వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక పోలీసు బృందాలను, టాస్క్‌ఫోర్స్‌ను నియమించాలని సూచించారు.ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆవులు, దూడలు వాహనాల ద్వారా ప్రవేశించకుండా ఎంట్రీ పాయింట్లపై ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని కోరారు. రామవరం సర్పంచ్ కర్ర వెంకట్‌రెడ్డి, యాకూబ్, రైతులు పాల్గొన్నారు.

కూలిన స్వాగత తోరణం



వర్ధన్నపేట : గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన స్వాగత తోరణం శనివారం కూలి పోయింది. జాతీయ రహదారిపై అవగాహన లేకుండా స్వాగత తోరణం ఏర్పాటు చేయడంతోనే కూలిపోయిందని పలువురు విమర్శిస్తున్నారు. ఎత్తు, వెడల్పు సరిగా ఏర్పాటు చేయకపోవడం వల్లనే స్వాగత తోరణం కూలిందని సొంత పార్టీ వారే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



నర్సంపేట రూరల్: ముగ్ధుంపురంలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్



నల్లబెల్లిలో..



ఖానాపురం: అశోక్‌నగర్‌లో..



దుగ్గొండి: నాచినపల్లిలో..



చెన్నారావుపేట: జల్లీలో..

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ముగ్ధుంపురంలో బడిబాట కార్యక్రమాన్ని శనివారం సర్పంచ్ పెండ్యాల జ్యోతి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సదాశివ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ సౌకర్యాలు

చెన్నారావుపేట : ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తోందని సర్పంచ్ పెరుమాండ్ల శ్రీధర్‌రెడ్డి, లక్ష్మి, హెచ్‌ఎం ఉమారాణి, జల్లీ హెచ్‌ఎం సరళ, పాపయ్యపేట హెచ్‌ఎం పాపమ్మ అన్నారు. ఈ మేరకు మండలంలోని ఆయా గ్రామాలల్లో ఉపాధ్యాయులు శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ బడీడు పిల్లలను సర్కారు బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించిందని, 8, 9, 10 తరగతులకు డిజిటల్ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 9వరకు విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 20న డిజిటల్ తరగతులు ప్రారంభిస్తున్నామన్నారు. పదో తరగతి ఫలితాలలో మండల టాప్‌లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే నిలిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో ఉపాధ్యాయులు వేణుబాబు, వినోద్, కుమారస్వామి, అనిల్, చంద్రకళ, అనిల్, చంద్రకళ, సీఆర్‌పీలు సంపత్, బాలు, స్వామి, కందిక శిల్ప, హేమలత ఉన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

పర్వతగిరి : బడీడు పిల్లలు బడిలో ఉండాలని పనిలో ఉండకూడదని హెచ్‌ఎం జలీల్ సూచించారు. ఈ మేరకు మండలంలోని అన్నారం, అన్నారంపెద్దతండా, రావూరు గ్రామాలలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలలో ఇంటింటికి తిరుగుతూ బడి ఈడు పిల్లలను కలిసి వారిని ప్రోత్సహిస్తూ పాఠశాలలో అడ్మిషన్ ఇచ్చారు. ఉపాధ్యాయులు బి.రాజు, జి.రాజు, శాంతికిరణ్, రాధాకృష్ణకుమారి పాల్గొన్నారు.

నల్లబెల్లిలో..

నల్లబెల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన అందిస్తున్నామని మండల విద్యా కోఆర్డినేటర్ రామస్వామి అన్నారు. ఆచార్య జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా నల్లబెల్లి హైస్కూల్ ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్ బాబు, కుమారస్వామి, సంతోష్ కుమార్, సీఆర్పీ వైనాల రవి తదితరులు పాల్గొన్నారు.

సంగెంలో..

సంగెం : ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందిస్తున్నారని ఎంపీపీ కళావతి అన్నారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన బడిబాట ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మన ఊరు–మన బడిలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గుండేటి బాబు, ఎంపీటీసీ మల్లయ్య, ఎస్ఎంసీ చైర్మన్ నీరటి నాగరాజు, ప్రధానోపాధ్యాయులు రవీందర్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

బడిబాట ప్రారంభం

దుగ్గొండి : మండలంలోని పలు గ్రామాల్లో బడిబాట కార్యక్రమం శనివారం ప్రారంభం అయింది. కార్యక్రమాలల్లో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, సర్పంచ్‌లు, విద్యాకమిటీ చైర్మన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖానాపురంలో..

ఖానాపురం : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని వైస్ ఎంపీపీ రామసహాయం ఉమారాణి, సర్పంచ్ గొర్రె కవిత అన్నారు. ఈ మేరకు మండలంలోని అశోక్‌నగర్, మంగళవారిపేట, బుధరావుపేట, ధర్మరావుపేటతో పాటు పలు గ్రామాల్లో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు మంజుల, పద్మావతి, డానియల్‌పాల్, అంజన్ కుమారస్వామి, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

చెన్నారావుపేట : మండలంలోని అక్కల్‌చెడ గ్రామ శివారులోని తేజావత్ తండాకు చెందిన తేజావత్ చెన్న నాయక్ శుక్రవారం మృతి చెందాడు. కాగా మృతదేహంపై కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్‌నాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన ఉప్పునూతుల వేణుచారి ఇటీవల మృతి చెందాడు. కాగా కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం క్వింటా బియ్యం అందించారు. కల్లెపు రాజశేఖర్, మండల నర్సింహరాములు, ఆవుల రాములు, ఎద్ల నారాయణరెడ్డి, రాజేశ్వర్‌రావు, వార్డు సభ్యులు ఉన్నారు. అలాగే మండల కేంద్రంలోని రాజీవ్ నగర్ కాలనీకి చెందిన పైసా సదానందం ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కాగా బీఆర్ఎస్ మండల నాయకులు కంది కృష్ణ చైతన్య మృతి కుటుంబానికి 50 కిలోల బియ్యం శనివారం అందించారు.

ఎమ్మెల్యే పెద్ది పరామర్శ

చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన పర్కాల రాజు వడదెబ్బతో శనివారం మృతి చెందాడు. కాగా రాజు మృతదేహంపై ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి, సర్పంచ్ కుండె మల్లయ్య, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ రఫి, కందకట్ల సాంబయ్య, జున్నూతుల రాంరెడ్డి, నరేందర్, ఉపేందర్, సాంబయ్య, సాధు నర్సింగరావు ఉన్నారు.

లింగయ్య సేవలు మరువలేనివి



దుగ్గొండి : దున్నేవాడికే భూమి నినాదంతో భూస్వాముల భూములను పేదలకు పంచిన కుసుంబ లింగయ్య సేవలు మరువలేనివని ఎంసీపీఐ డివిజన్ కార్యదర్శి ఎండీ రాజాసాహెబ్ అన్నారు. మండలంలోని రేబల్లె గ్రామంలో లింగయ్య వర్ధంతిని శనివారం నిర్వహించారు. అనంతరం రాజాసాహె బ్ మాట్లాడారు. 1971లో పేదలకు భూ పంపిణీ కోసం జరిగిన పోరాటంలో భూస్వామ్య గుండాల చేతిలో లింగయ్య అమరుడయ్యాడన్నారు. లింగయ్య అమరత్వం వల్లనే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1.60లక్షల ఎకరాల భూమి పేదలకు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు కుసుంబ బాబురావు, సిరిబొమ్మల భాస్కర్, హుస్సేన్, గటిక మొగిలి కార్యకర్తలు పాల్గొన్నారు.